# వైభవంగా బ్రహ్మోత్సవాలు

**స్టేషన్ మహబూబ్‌నగర్:** జిల్లా కేంద్రం సింహగిరిలోని శ్రీ లక్ష్మీనృంహస్వామి తృతీయ పుష్కర ప్రయుక్త 36వ బ్రహ్మోత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారి శోభాయాత్రను పట్టణంలో కనుల పండువగా నిర్వహించారు. ఆలయం నుంచి ప్రారంభమైన స్వామివారి శోభాయాత్ర బోయపల్లి గేట్, తెలంగాణ చౌరస్తా, అశోక్‌టాకీస్ చౌరస్తా, క్లాక్‌టవర్, పాతబస్టాండ్, కొత్తగంజ్ ఫ్లైఓవర్ మీదుగా తిరిగి ఆలయం వరకు నిర్వహించారు. సింహగిరీశుని శోభాయాత్రతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. శోభాయాత్రలో భక్తులు భజనలు ఆలపించడంతోపాటు డోలు, దాండియా, అడుగుల భజన, కోలాటాలు వేశారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా వచ్చేనెల 1వ తేదీన సుదర్శన నారసింహా హోమం, 2న ధ్వజారోహణం, 3న ఎదుర్కొళ్ల ఉత్సవం, 4న స్వామివారి కల్యాణోత్సవం, 5న శ్రీస్వామివారి రథోత్సవం, 6న చక్రతీర్థం, సహస్ర కళశాభిషేకం తదితర పూజలు నిర్వహించనున్నారు.


జిల్లా కేంద్రంలో శ్రీలక్ష్మీనరసింహస్వామికి పూజలు చేస్తున్న అర్చకులు

**ఆంజనేయస్వామి రథోత్సవం..**

జిల్లా కేంద్రం శ్రీనివాసకాలనీలోగల శ్రీపంచముఖి ఆంజనేయస్వామి ఆలయం 19వ వార్షికోత్సవ వేడుకలు శనివారం రాత్రి ముగిశాయి. ఉదయం శ్రీదేవి, భూదేవి సహిత శ్రీ లక్ష్మివెంకటేశ్వరస్వామి వారికి అభిషేకం, మహాసుదర్శన హోమం, పూర్ణాహుతి తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం దేవాలయం ఆవరణలో స్వామివారి రథోత్సవం నిర్వహించారు.


మంగళహారతులతో మహిళలు

**ఘనంగా శకటోత్సవం..**

**మిడ్జిల్:** మండలంలోని మల్లాపూర్ లక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం శకటోత్సవం నిర్వహించారు. ఎద్దుల బండ్లు, ట్రాక్టర్లను ప్రత్యేకంగా అలంకరించి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సాయిలక్ష్మి, ఎంపీఓ అనురాధ, సర్పంచ్ జంగారెడ్డి పాల్గొన్నారు.

**దేవరకద్ర:** మండల కేంద్రంలోని లక్ష్మీ చెన్నకేశ్వస్వామి ఆలయంలో శనివారం ఘనంగా కల్యాణోత్సవం జరిగింది. మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం, ప్రత్యేక అలంకరణ అనంతరం ఘనంగా నిర్వహించారు.


జిల్లా కేంద్రంలోని శ్రీనివాసకాలనీలో రథోత్సవంలో పాల్గొన్న భక్తులు


దేవరకద్రలో లక్ష్మీ చెన్నకేశ్వస్వామి కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

**బీజేపీ నాయకుల పూజలు..**

**గండేడ్:** రథసప్తమి సందర్భంగా గండేడ్ మండలంలోని పగిడ్యాల్ జాతర ఉత్సవాల్లో బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారుతీ కిరణ్ ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పూజారులకు వస్త్రాలను అందజేశారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా కార్యదర్శి మహిపాల్, మండల అధ్యక్షుడు ప్రభునాయక్, ప్రధాన కార్యదర్శి నర్సింహరెడ్డి, కోశాధికారి రాఘవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


డోలు వాయిస్తున్న కళాకారులు


రాచాలలో కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

**వైభవంగా చెన్నకేశవుడి కల్యాణం**

**అడ్డాకుల:** మండలంలోని రాచాల శ్రీచెన్నకేశవ స్వామి ఆలయం వద్ద బ్రహ్మోత్సవాలు శనివారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి కల్యాణం నిర్వహించారు. ఆలయానికి సమీపంలో ఉన్న దేవుని బావి వద్దకు వెళ్లిన పండితులు గంగాపూజ నిర్వహించిన అనంతరం గంగను తీసుకుని స్వామి వారి మూలవిరాట్‌ను అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామ పెద్ద గౌని చెన్నారెడ్డి రూ.2కోట్లతో నిర్మించిన కల్యాణ మండపంలో శ్రీలక్ష్మీ, చెన్నకేశవస్వామి ఉత్సవ విగ్రహాలకు కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ తిరుపతయ్య యాదవ్, వైస్ ఎంపీపీ రాధిక, గ్రామ పెద్ద గౌని చెన్నారెడ్డి పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### కరాటేతో విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం

**అడ్డాకుల:** కరాటే నేర్చుకుంటే విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం పెరుగుతుందని హెచ్‌ఎం వనిత పేర్కొన్నారు. మూసాపేట మండలం కొమిరెడ్డిపల్లి పాఠశాలలో శనివారం నుంచి బాలికలకు కరాటే శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. కరాటే మాస్టర్ సత్యనారాయణ నెల రోజుల పాటు బాలికలకు కరాటేలో శిక్షణ ఇవ్వనున్నారు. నేటి సమాజంలో బాలికలకు ఆత్మరక్షణ చాలా అవసరమైన నేపథ్యంలో కరాటేను నేర్పిస్తున్నట్లు హెచ్‌ఎం తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సాయిరెడ్డి, మాజీ ఎంపీపీ కృష్ణయ్య పాల్గొన్నారు.

### సంకలమద్దిలో పశువైద్య శిబిరం



**అడ్డాకుల:** మూసాపేట మండలంలోని సంకలమద్దిలో శనివారం పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పశువైద్య శిబిరం నిర్వహించారు. మండల పశువైద్యాధికారి డాక్టర్ మధుసూదన్ ఆధ్వర్యంలో ఆవులు, గేదెలకు గర్భకోశ, చూడీ పరీక్షలు చేశారు. బలహీనంగా ఉన్న పశువులు, గేదెల కోసం మినరల్ మిక్చర్, హిమాలయ భత్తీస ప్యాకెట్లను పాడి రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల రైతుబంధు సమితి అధ్యక్షుడు భాస్కర్‌చందర్‌గౌడ్, సర్పంచ్ డి.స్వరూప, పశువైద్య సిబ్బంది చంద్రమోహన్‌రెడ్డి, రైతులు అశోక్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

**హన్వాడ:** మండలంలోని వేపూర్ పశువైద్యశాలలో వైద్య శిబిరం నిర్వహించారు. హన్వాడ, గండేడ్ పశువైద్యులు దివ్యభారతి, రాంప్రసాద్‌ల ఆధ్వర్యంలో గేదెలు, ఆవులకు గర్భకోశ వ్యాధి చికిత్స, సుడి పరీక్షలతో పాటు వివిధ రకాల పరీక్షలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

### మూసాపేట ఎస్‌ఐకి సన్మానం



**అడ్డాకుల:** మూసాపేట పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐగా పనిచేస్తున్న బి.నరేష్‌ను శనివారం వివిధ గ్రామాలకు చెందిన నాయకులు సత్కరించారు. పౌర సేవల్లో రాష్ట్ర స్థాయిలో మూడో ర్యాంకు రావడంతో వివిధ గ్రామాల నాయకులు సత్కరించి అభినందించారు. అదే విధంగా స్టేషన్ రైటర్ కృష్ణను సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కృష్ణయ్య, కొమిరెడ్డిపల్లి సర్పంచ్ సాయిరెడ్డి, వేముల ఎంపీటీసీ సత్యనారాయణ, నాయకులు తిరుపతిరెడ్డి, సుధాకర్ పాల్గొన్నారు.

### స్నేహితుడి కుటుంబానికి చేయూత

**చిన్నచింతకుంట:** మండలంలోని అప్పంపల్లిలో వారం రోజుల కిందట గ్రామానికి చెందిన మంగళి పుల్లప్ప అనారోగ్యంతో మరణించాడు. దీంతో పుల్లప్ప స్నేహితులు శనివారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.27వేల ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో రామకృష్ణారెడ్డి, వెంకటేష్, శివరాములు, రాములు, అశోక్‌రెడ్డి ఉన్నారు.

### బస్సులు నడపాలని నిరసన

**మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్:** గ్రామీణ ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రానికి వచ్చే విద్యార్థుల కోసం ఆర్టీసీ పూర్తి స్థాయిలో బస్సులు నడిపించడం లేదని, దీంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలోని బస్ డిపో వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. విద్యార్థులు వస్తున్న ప్రతి గ్రామానికి కూడా బస్సు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు భరత్, ప్రశాంత్, విద్యార్థులు పాల్గొన్నారు.

### రేషన్‌బియ్యం పట్టివేత

**జడ్చర్ల:** బాదేపల్లిలో అక్రమంగా విక్రయిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం శనివారం ఆకస్మికంగా తనిఖీలు చేసి ప్రజలకు ప్రభుత్వం సరఫరా చేస్తున్న బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేస్తున్న వ్యాపారులపై దాడులు చేసి పట్టుకున్నారని తెలిపారు. పాత బజార్‌కు చెందిన వ్యాపారి శ్రీనివాసులు వద్ద 2.50క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీన పర్చుకున్నామని, గంజ్ ఏరియాలోని బాలస్వామి వద్ద 2.75 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకొని సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్ యూసూఫ్‌అలీకి అప్పగించినట్లు తెలిపారు. పట్టుబడిన వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

### మండలంగా ప్రకటించండి

**కోయిల్‌కొండ:** మండలంలోని గార్లపహాడ్‌ను మండలంగా ప్రకటించాలని శనివారం 6వ రోజు రిలేనిరాహార దీక్షలు నిర్వహించారు. గార్లపహాడ్ చుట్టు పక్కల గ్రామాల ప్రజలు రిలే దీక్షలు కూర్చున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం గార్లపహాడ్‌ను మండలంగా ప్రకటించేవరకు రిలే దీక్షలు కొనసాగిస్తామని తెలిపారు.

## నర్సరీ పనులు వేగవంతం చేయాలి

**గండేడ్:** నర్సరీ పనులు వేగవంతం చేయాలని, నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని డీఆర్‌డీఓ యాదయ్య హెచ్చరించారు. శనివారం ఆయన మండలంలోని పలు నర్సరీలను పరిశీలించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో మాట్లాడారు. నర్సరీ పనులు నత్తనడకన కొనసాగుతున్నాయని, నిర్వహణను వేగవంతం చేయాలన్నారు. కూలీల సంఖ్యను పెంచి పనుల్లో జాప్యం లేకుండా చూడాలని సూచించారు. కూలీల ఆధార్ తప్పనిసరిగా నమోదు చేయాలని తెలిపారు. సోషల్ ఆడిట్ రికవరీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రికవరీ చేయడంలో ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రశ్నించారు. నిర్ధారించిన మేరకు డబ్బులు వెంటనే రికవరీ చేయాలని ఎంపీడీఓ రూపేందర్‌రెడ్డిని ఆదేశించారు. సమావేశంలో ఏపీఓ హేమచంద్రుడు, ఉపాధిహామీ టీఏలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఆర్‌డీఓ యాదయ్య

## విలీన గ్రామాల్లో వేగంగా అభివృద్ధి

**మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ:** విలీన గ్రామాల్లో అభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శనివారం మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని చిన్నదర్పల్లి, లక్ష్మణ్‌నాయక్‌తండా, నీలినాయక్‌తండాల్లో రూ.81.30లక్షలతో నిర్మించే సీసీరోడ్లు, డ్రెయినేజీలు, కమ్యూనిటీ భవనాలకు శంకుస్థాపన చేశారు. అనంతరం చిన్నదర్పల్లిలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ గతంలో గ్రామాలన్నీ దుర్గంధంతో ఎలాంటి సౌకర్యాలు లేక ప్రజలు ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొన్నారన్నారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత సీసీరోడ్లు, డ్రెయినేజీలు, తాగునీటి సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. త్వరలోనే అన్ని వార్డులతో పాటు విలీన గ్రామాల్లో పర్యటించి సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామన్నారు. 'కంటివెలుగు'లో భాగంగా 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించడమేగాక కంటి అద్దాలను పంపిణీ చేస్తున్నామన్నారు. కంటి సమస్యలు ఉన్న వారు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, కమిషనర్ డి.ప్రదీప్‌కుమార్, కౌన్సిలర్ లత తదితరులు పాల్గొన్నారు.

## పగిడ్యాల్ జాతరకు పోటెత్తిన భక్తులు


పల్లకీసేవ నిర్వహిస్తున్న భక్తులు

**గండేడ్:** మండలంలోని పగిడ్యాల్ కృష్ణబ్రహ్మేంద్ర స్వామి జాతర ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. మూడు రోజుల పాటు జరిగే జాతర ఉత్సవాలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. శనివారం ఉదయం సాధుపూజ, పాదుకపూజ చేపట్టారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు జాతరకు పోటెత్తారు.

## బుద్ధుడి విగ్రహం ప్రతిష్ఠాపన

**దేవరకద్ర:** మండల కేంద్రంలోని శ్రీనివాస గార్డెన్‌లో శనివారం గౌతమ బుద్ధ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. గార్డెన్ యజమాని కల్వ నరేష్ ఆధ్వర్యంలో వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు చంద్రయ్య పూజలు నిర్వహించి విగ్రహాన్ని వేదికపై ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు కల్వ కన్నయ్య, హరికాంత్, వీహెచ్‌పీ నాయకులు నిరంజన్‌రెడ్డి, తిప్పారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శాంతిభద్రతల పరిరక్షణకు కృషి

**దేవరకద్ర రూరల్:** శాంతి భద్రతల పరిరక్షణ కోసమే కండక్ట్ కమ్యూనిటీ నిర్వహిస్తున్నట్లు సీఐ రజితారెడ్డి తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు శనివారం హజీలాపూర్‌లో సెర్చ్ నిర్వహించారు. గ్రామంలోని ఇంటింటికీ తిరిగి సోదాలు నిర్వహించారు. ద్విచక్ర వాహన పత్రాలు, ఆధార్‌కార్డులను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ మాట్లాడారు. ప్రజల సంక్షేమం, రక్షణ కోసమే పోలీసులు అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. గ్రామాల్లో ఎటువంటి ఇబ్బందులు కలుగాకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు. తనిఖీల్లో సరైన పత్రాలు లేని 10 ద్విచక్ర వాహనాలు సీజ్ చేయడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.


గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ రజితా రెడ్డి

## విద్యార్థులు శ్రద్ధతో చదవాలి


మాట్లాడుతున్న ఎంఈఓ లక్ష్మణ్‌సింగ్

**చిన్నచింతకుంట:** విద్యార్థులు శ్రద్ధతో చదివి ఉన్నత లక్ష్యాలు సాధించాలని ఎంఈఓ లక్ష్మణ్‌సింగ్ విద్యార్థులకు సూచించారు. మండల కేంద్రంలోని పదో తరగతి విద్యార్థులకు శనివారం కస్తూర్బా బాలికల పాఠశాలలో సేవా భారత్ పాలమూర్ శాఖ ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాస శిక్షణ తరగుతులు నిర్వహించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సేవా భారత్ రాష్ట కమిటీ సభ్యుడు సుబ్రమణ్యం, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, శివశంకర్, ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఆలయ నిర్మాణానికి భూమిపూజ

**బాలానగర్:** మండల కేంద్రంలోని గుట్టపై వెలసిన శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణ పనులను సర్పంచ్ విజయలక్ష్మి శనివారం ప్రారంభించారు. ఎంతో పురాతన ఆలయం కాగా, శిథిలావస్థకు చేరి కప్పుపోయిందని తెలిపారు. ఆలయ నిర్మాణంలో భాగంగా ఫిల్లర్లతో కప్పు ఏర్పాటుకు సొంత నిధులతో ముందుకు వచ్చిన సర్పంచ్ దంపతులను గ్రామ డిప్యూటీ సర్పంచ్ గిరిధర్, మాజీ సర్పంచ్‌లు శ్రీనివాస్ యాదవ్, గ్రామ పెద్దలు కోట జనార్దన్, గణేష్ గౌడ్, భాస్కర్, రాజు అభినందించారు.


వేంకటేశ్వర ఆలయ నిర్మాణానికి భూమిపూజ నిర్వహించిన గ్రామస్తులు

# భక్తిశ్రద్ధలతో రథసప్తమి


రాజాపూర్ మండలం తిర్మలాపూర్‌లో పారాయణం చేస్తున్న భక్తులు

- ఆలయాల్లో భక్తుల ప్రత్యేక పూజలు

**స్టేషన్ మహబూబ్‌నగర్:** జిల్లా వ్యాప్తంగా శనివారం రథసప్తమి వేడుకలను ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రం వేంకటేశ్వరకాలనీలోని ఓ పాఠశాలలో శనివారం ఉదయం 7నుంచి 10:30 గంటల వరకు వేడుకలను నిర్వహించారు. ముందుగా శ్రీవారికి పూజలు చేసి సుజాత అన్నమాచార్య సంకీర్తన ఆలపించారు. విద్యార్థులు సామూహిక ఆదిత్య హృదయ పఠనం గీతాపారాయణం చేశారు. అనంతరం టీటీడీ ఉమ్మడి జిల్లా సమన్వయకర్త డాక్టర్ ఉత్తరపల్లి రామాచారి ధార్మిక ప్రవచనంలో రథసప్తమి విశిష్టత గురించి వివరించారు. సూర్యుడు లేకుంటే సృష్టిలోని జీవరాసులకు మనగడే లేదన్నారు. సూర్యుడి వేడి, వెలుతురు వల్ల ప్రాణికోటి జీవనం సాగిస్తుందన్నారు. నిరంతరం యోగా, సూర్యనమస్కారాలు చేయడం వల్ల విద్యార్థుల్లో ధారణశక్తి (జ్ఞాపకశక్తి) పెరుగుతుందని, తద్వారా చదువులో కూడా రాణించవచ్చన్నారు.

**విష్ణుసహస్రనామ పారాయణం..**

**రాజాపూర్:** రథసప్తమి సందర్భంగా మండలంలోని తిర్మలాపూర్‌లో శనివారం భ్రమరాంభా మల్లికార్జునస్వామి ఆలయంలో హనుమాన్‌చాలీసా, విష్ణుసహస్రనామగీతా పారాయణం పఠనం చేశారు. వివిధ గ్రామాల ప్రజలు సూర్య దేవుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**దేవరకద్ర:** మండల కేంద్రంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో శనివారం జిల్లా ఆర్యవైశ్య సంఘం వారు అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించారు. రథసప్తమి సందర్భంగా మహబూబ్‌నగర్ జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు పాలది రామ్మోహన్‌తో పాటు కార్యవర్గ సభ్యుల బృందం, యువజన సంఘం అధ్యక్షుడు ప్రమోద్‌కుమార్, జిల్లా మహిళా సంఘం అధ్యక్షురాలు మంజుల కార్యవర్గ బృందంతో కలిసి అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించారు.

**నవాబుపేట:** మండలంలోని కొల్లూర్‌లో రథసప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వెంకటేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి రథసప్తమి వేడుకలు చేపట్టారు. సర్పంచ్ సౌజన్య, ఉపసర్పంచ్ నర్సింహచారీ, మార్కెట్ వైస్ చైర్మన్ చందర్‌నాయక్, బీఆర్ గౌడ్, వెంకటేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.


జిల్లా కేంద్రంలో సూర్య నమస్కారాలు చేస్తున్న విద్యార్థులు

**యోగాసనాలు.. సూర్యనమస్కారాలు**

యోగా గురువు పురుషోత్తం విద్యార్థులతో 12 రకాల సూర్య నమస్కారాలు చేయించారు. దాదాపు అరగంటకుపైగా సాగిన కార్యక్రమం ఎంతగానో ఆకట్టుకుంది. అనంతరం పురుషోత్తం చేసిన యోగాసనాలు అలరించాయి. పాఠశాల కరస్పాండెంట్ భానుప్రకాశ్, యాజమాన్య సభ్యులు రమేశ్, భారతి, మంజుల, ఆనంద్, రవికుమార్, శ్రీవారి సేవకు లు పాండురంగం, కేశవులు, సురేష్ చందర్ దూత్, నాగశివలక్ష్మి, వెంకటేశ్వర్లు, రమేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

**హన్వాడ:** మండలంలో రథసప్తమి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. టంకరలోని శ్రీచెన్నకేశవస్వామి ఆలయంలో గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేసి ఆలయం చుట్టూ ఎద్దుల బండ్లతో ప్రదక్షిణలు చేశారు. వేపూర్ ఆంజనేయస్వామి ఆలయంలో రథసప్తమి పూజలు చేశారు. మండల కేంద్రంలోని చంద్రాయునిగుట్టపై వెలసిన శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో రథసప్తమిని పురస్కరించుకుని రథోత్సవాన్ని నిర్వహించారు.


వేపూర్‌లో భజనలు చేస్తున్న భక్తులు


దేవరకద్రలో పట్టువస్త్రాలు సమర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు


టంకరలో ఎద్దుల బండ్లతో ఊరేగింపు..

## పాఠశాలకు వితరణ


పాఠశాలకు ఇన్సినెరేటర్‌తో విద్యార్థి, ఉపాధ్యాయులు

**గండేడ్:** తాను చదువుకున్న పాఠశాలకు పూర్వ విద్యార్థి శానిటరీ డెస్ట్రాయర్ ఇన్సినెరేటర్‌ను శనివారం వితరణ చేశారు. నారాయణపేట జిల్లా గుండుమాల్‌కు చెందిన కాట్రావత్ అనిల్‌కుమార్ 2013లో గండేడ్ మండలంలోని వెన్నాచేడ్ మాడల్ స్కూల్‌లో 6వ తరగతిలో చేరాడు. ఇంటర్ పూర్తి చేసి ప్రస్తుతం సీఎంఆర్‌ఐటీ హైదరాబాద్‌లో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. చదువుతో పాటు అమెరికాకు చెందిన ప్యూర్ స్వచ్ఛంద సంస్థలో స్టూడెంట్ వలంటీర్‌గా పనిచేస్తున్నాడు. సంస్థ తరఫున స్వచ్ఛందంగా నాలుగు శానిటరీ డెస్ట్రాయర్‌లను ఉచితంగా పాఠశాలకు అందజేశాడు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ కొండల్ రావు విద్యార్థిని సన్మానించారు.

## క్రీడామైదానం పనులు పూర్తి చేయాలి

**కోయిల్‌కొండ:** మండలంలోని గ్రామ పంచాయతీల్లో పెండింగ్‌లో ఉన్న క్రీడా మైదానాలను వెంటనే పూర్తి చేసేలా అధికారులు చొరవ తీసుకోవాలని ఎంపీడీఓ జయరాములు తెలిపారు. శనివారం మండలంలోని ఖాజీపూర్‌లో చేపడుతున్న క్రీడామైదానం పనులను ఆయన పరిశీలించారు. మండలంలో దాదాపుగా 90శాతం క్రీడా మైదానాలు పూర్తికావడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

